క్లుప్తంగా...

ఉచిత శిక్షణ

సుల్తాన్‌బజార్: యువతకు ఉచిత ఉపాధి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఐసీఐసీఐ ఫౌండేషన్ ట్రైనర్ పొలెపల్లి వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఐసీఐసీ అకాడమీనందు ఉచిత ఎయిర్ కండీషన్ రిపేయిర్, రిఫ్రిజిరేటర్ సర్వీసింగ్‌లో ఉచిత ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల లోపు యువతకు ఇంటర్, డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులని తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, అనంతరం ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 93933 45451లో సంప్రదించవచ్చు.

బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్ఆర్.లక్ష్మణ్



సుల్తాన్‌బజార్: బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా గౌలిగూడకు చెందిన ఎస్ ఆర్.లక్ష్మణ్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బజరంగ్‌సేనను విస్తరిస్తామన్నారు. జిల్లా మండల కమిటీలు వేసి కార్యవర్గాన్ని విస్తరిస్తామన్నారు. హిందూవులపై దాడులను అరికట్టేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. అలాగే గో మాత రక్షణ కోసం బజరంగ్ సేనా పాటుపడుతుందన్నారు.

రేపు బసవేశ్వర జయంతి పల్లకీ ఊరేగింపు

గౌలిపురా: రాష్ట్ర వీర శైవ లింగాయత్ లింగ బలిజ సంఘం భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 30న బసవేశ్వర జయంతి పల్లకీ ఊరేగింపు ఉంటుందని జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విజయ్ ఓ ప్రకటనలో తెలిపారు. లలితాబాగ్ లలితా దేవి ఆలయం నుంచి సాయంత్రం 4 గంటలకు ఊరేగింపు ప్రారంభమవుతుందని.. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

తెలంగాణ సిగలో సచివాలయం ఒక అద్భుత సౌధం

నాంపల్లి: సచివాలయానికి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పేరిట నామకరణం చేయడం శుభపరిణామం అని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి సోమయ్య అభిలాషించారు. ఈ మేరకు ఆయన నాంపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్ర సిగలో సచివాలయం ఒక అద్భుత సౌధమని అభివర్ణించారు. పరిపాలన సౌలభ్యం కోసం విలక్షణమైన శైలిలో అత్యాధునిక రీతిలో నిర్మించిన ఇలాంటి కట్టడం మరెక్కడా ఉండబోదన్నారు. ఈ అద్భుత కట్టడాన్ని ఆవిష్కృతం చేయడానికి సంకల్పించిన సీఎం కేసీఆర్, సచివాలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి కావడానికి సహకరించిన రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, జగదీష్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్‌కు ఉద్యోగుల సంఘం పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పుస్తక ముద్రణకు తెలుగు వర్సిటీ ఆర్థిక సాయం

నాంపల్లి: తెలుగు రచయితలకు తమ రచనలను ముద్రించుకోవడానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సాయం అందజేస్తోంది. తెలుగు భాష, సాహిత్యం, కళలు, చరిత్ర, సంస్కృతికి సంబంధించిన సృజనాత్మక, పరిశోధన, విమర్శనాత్మక రచనల్ని ఆర్థిక సహాయం కోసం పంపవచ్చు. దరఖాస్తును విశ్వవిద్యాలయంలోని విస్తరణ సేవా విభాగం లేదా తెలుగు వర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు. దరఖాస్తును పూర్తి చేసి ఏదేని ముద్రణా సంస్థ నుంచి పొందిన ఒక కొటేషన్‌ను తీసుకుని దరఖాస్తుకు జతపరచాలి. మే 31వ తేదీలోగా పూరించిన దరఖాస్తులను ఇన్‌చార్జి, విస్తరణ సేవా విభాగం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్-4 చిరునామకు పంపాలని రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఓ ప్రకటనలో కోరారు.

నియామకం

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ జోన్ ప్రభుత్వ ఖాజీగా మహ్మద్ గౌస్ షా ఖాద్రిని మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ షేక్ పర్వీన్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గౌస్ షా ఖాద్రి మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు తన సేవలను ఉచితంగా అందజేస్తానని తెలిపారు. మహ్మద్ భాయ్, మెహతాబ్ తిస్తీ, జమ్‌షీద్‌ఖాన్, మహ్మద్ అతీఖ్, మహ్మద్ ఖదీర్, మహ్మద్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగూడ రాజీవ్ గృహకల్పలో చోరీ

రాజేంద్రనగర్: కూరగాయాలు అమ్మేందుకు వెళ్లి వచ్చే సరికి ఇంట్లో దొంగలుపడి ఆరు తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. మైలార్‌దేవ్‌పల్లికి చెందిన కమలమ్మ లక్ష్మీగూడ రాజీవ్ గృహకల్పలో నివసిస్తుంది. శుక్రవారం ఉదయం కూరగాయలు అమ్మేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లింది. 11 గంటల ప్రాంతంలో తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా ఆరు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డును కబ్జా చేస్తే చర్యలు తప్పవు

- స్పందించిన దక్షిణ మండలం ట్రాఫిక్ పోలీసులు
- మీరాలంమండిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కబ్జాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్న వ్యాపారస్తులను కట్టడి చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చార్మినార్: 'దర్జాగా రోడ్డు కబ్జా'అనే శీర్షికతో శుక్రవారం 'సాక్షి'దినపత్రికలో ప్రచురితమైన కథనానికి దక్షిణ మండలం ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులు రోడ్డు కబ్జా జరిగిన మీరాలంమండికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. తమ తమ దుకాణాలకు ముందు గల రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో వినియోగదారులతో పాటు అటు వైపు రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు కలుగుతున్న ఇబ్బందులను ట్రాఫిక్ పోలీసులు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులను కట్టడి చేశారు. కొంతమందికి చలాన్లు విధించారు. రోడ్లను ఆక్రమించి వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు కలిగించే విధంగా తమ దుకాణాల ముందు వస్తువులను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు హెచ్చరించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



కింగ్‌స్టన్ ఆస్పత్రిలో క్యాత్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సెస్ జైరీన్ ముఖ్రమ్ జా

గోల్కొండ: ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ 8వ నిజాం ముఖర్రమ్ జా బహదూర్ కూతురు ప్రిన్సెస్ జైరీన్ ముఖ్రమ్ జా అన్నారు. శుక్రవారం ఆమె మాసబ్‌ట్యాంక్‌లోని కింగ్ స్టన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన క్యాత్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కింగ్‌స్టన్ ఆస్పత్రి వారు ఎంతో ఖరీదైన రోగ నిర్ధారణ పరీక్షల కోసం క్యాత్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అయితే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల వారు అన్ని వర్గాల రోగులకు వారికి అందుబాటులో ఉండే విధంగా ఛార్జీలు వసూలు చేయాలని అన్నారు. హైదరాబాద్ నగరం తనకెంతో ప్రత్యేకమైని, నేడు ఈ నగరం విశ్వనగరంగా రూపుద్దిదుకోవడం తనకెంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. దీనితో పాటు తాను అసఫ్‌జాహీ వంశానికి చెందడం తనకెంతో గర్వకారణమని ఆమె అన్నారు. తన పూర్వీకులు ఈ నగరాన్ని నిర్మించడం జరిగిందని, ఆ నగరం నేడు ప్రపంచంలోని అత్యంత ప్రత్యేకమైన నగరంగా రూపుద్దిదుకోవడం అభినందించదగ్గ విషయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ షోయబ్ శుబానీ, డాక్టర్ మహ్మద్ ఫైసల్ తదితరులున్నారు.

ఖేలో భారత్-జీతో భాగ్యనగర్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో పాల్గొనండి

చార్మినార్: ఖేలో భారత్-జీతో భాగ్యనగర్ పేరుతో హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని క్రీడాకారులకు బీజేపీ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా ఐటీ సెల్ రాష్ట్ర కన్వీనర్, బాక్సర్ ప్యారసాని వెంకటేశ్ తెలిపారు. మే 9, 10వ తేదీల్లో జరగనున్న స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ నెల 30వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెట్ తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. తమ పేర్లను నమోదు చేసుకోవడానికి ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు. ఈ మ్యాచ్‌లన్నీ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఆయా శాసనసభ నియోజకవర్గాల ఏరియాల్లో మాత్రమే జరుగుతాయన్నారు. నియోజకవర్గాల వారీగా నిర్వహించే పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన వారికి అవార్డులను అందజేయడంతో పాటు పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో జరిగే గ్రాండ్ ఫినాలేకి అర్హులవుతారన్నారు. తమ పేర్లను నమోదు ఆధార్ కార్డు జిరాక్స్‌ను అందజేయాలన్నారు.

సమగర సమాజ్ భవనం నిర్మించండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

అబిడ్స్: సమగర సమాజ్ కులస్తులకు ఆత్మగౌరవ భవనం నిర్మించాలని మంత్రి గంగుల కమలాకర్‌కు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గోషామహల్‌కు చెందిన సమగర సమాజ్ ప్రతినిధులతో కలిసి ఆయన మంత్రి గంగుల కమలాకర్‌కు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమగర సమాజ్‌కు ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించాలని ఇచ్చిన లెటర్‌ను కూడా మంత్రి గంగుల కమలాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్యాబినెటల్‌లో ఈ ప్రతిపాదన పెట్టి భవన నిర్మాణానికి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ్ నాయకులు కృష్ణ, ప్రకాష్, రాజేష్, సంత్ శివప్ప, రఘునందన్, శివకల్యాణ్, సుదర్శన్, శివచరణ్, నారాయణ బాబా, దుర్గారాజ్, విజయ్ పాల్గొన్నారు.

జలమండలి సేవలు భేష్



నిరంజన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఖాజా జౌహర్ అలీ

గోల్కొండ: జలమండలిలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పనితీరు భేష్ అని రాష్ట్ర మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. జలమండలి మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజా జౌహర్ అలీ నిరంజన్‌రెడ్డిని శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పీర్జగూడ సర్పంచ్ మహ్మద్ ముబిన్ ఘోరి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

యాకుత్‌పురా: హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ వజ్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి అన్న ప్రసాదని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భరత్ ప్రకాశ్, ప్రతినిధులు దత్తాత్రేయ, సతీష్‌కుమార్, క్రాంతికుమార్, కృష్ణ, చేతన్ సూరి, వినోద్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

భారతీయ కళలను కాపాడుకోవాలి



గన్‌ఫౌండ్రీ: భారతీయ కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి డాక్టర్ జి.విజయరామారావు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర స్థాయి నిత్య వైష్ణవ ఆధ్వర్యంలో మితా అయ్యాళ్వార్ సంగీత, నృత్య సాహిత్య కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరించిపోతున్న కళలను పరిరక్షించుకుని భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీమాన్, సముద్రాల శఠకోపాచార్యులు, సంస్థ అధ్యక్షుడు తిరుకోవెల సత్తయ్య, కోశాధికారి గుండె కృష్ణయ్య పాల్గొన్నారు.

మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు

సుల్తాన్‌బజార్: ప్రధాని నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖలు చేసిన ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మను శుక్రవారం జాంబాగ్ బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో మోజంజాహి మార్కెట్ చౌరస్తాలో దహనం చేశారు. అనంతరం రాకేష్ జైస్వాల్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే భారతదేశానికి పేరు ప్రతిష్టలు తీసుకువస్తున్న నరేంద్రమోదీని కించపరిచి మాట్లాడడం ఖర్గేకు తగదన్నారు. ఆయన మాటలు వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మయూర్, రాజుయాదవ్, రఘు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నాంపల్లి: నృత్య దీక్షాలయ సంస్థ ఆధ్వర్యంలో నృత్యేక్షణ శీర్షికన శుక్రవారం రాత్రి తెలుగు వర్సిటీ ప్రాంగణంలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ప్రదర్శనలో భాగంగా కళాకారుడు ఎస్.వి.కే.వి.పి.దీక్షితులు కూచిపూడి నృత్య ప్రదర్శనను లయాత్మకంగా ప్రదర్శించి అందరిని అబ్బురపరిచారు. ఎస్.వి.కే.వి.పి.దీక్షితులు తన మాతృశ్రీ లక్ష్మీ శంకర్, నృత్య గురువు వెంపటి చిన సత్యం కుమార్తె చావలి బాలత్రిపుర సుందరి వద్ద శిష్యరికం పొందారు. ముఖ్యఅతిథులుగా నృత్య చూడామణి వైజయంతి కాశీ, డాక్టర్ రుద్రవరం సుధాకర్, డాక్టర్ రత్నశ్రీ సుధాకర్, నాట్య విశారద లలిత కల్పన, బి.సుధీర్ హాజరై కళాకారుడిని ఆశీర్వదించారు. కళాకారుడు చేసిన నృత్య కల్పనాంశాలను చూసి మెచ్చుకున్నారు. పార్వతి నందనం, జటాధార, క్షీర సాగర శయన, పూరయమామ కామం తరంగం, గరుడధ్వని, తిల్లాన, జానకి నాయక మంగళం వంటి అంశాలకు ప్రదర్శించారు.

ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం అవసరం



రాజు వస్తాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని నానల్‌నగర్ కోవెల రంగనాథస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు అన్నారు. కోవెల రంగనాథస్వామి ఆలయ పునరుద్ధరణకు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు ప్రముఖ సంఘ సేవకుడు ఎస్. రాజు వస్తాద్ సహకరిస్తున్న సందర్భంగా ఆయనను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా రాజు వస్తాద్ మాట్లాడుతూ.. దైవ సేవకు మించిన పుణ్యకార్యం మరేది లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ నర్సింహ, ఆలయ పూజారి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ చిరంజీవి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



సుల్తాన్‌బజార్: తుకారంగేట్ పోలీసులు చేసిన లాకప్ డెత్‌లో చనిపోయిన ఆటోడ్రైవర్ చిరంజీవి కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని తెలంగాణ ఆటోడ్రైవర్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లా ఖాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆటోడ్రైవర్ల సమస్యలను పట్టించుకోకపోవడం లేదని, ఇటీవల కాలంలో తూకారం పోలీసులు చితకబాదడంతో చిరంజీవి అనే ఆటోడ్రైవర్ మృతిచెందారన్నారు. ఆటోడ్రైవర్ చిరంజీవి మృతికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఆంజనేయులు, లక్ష్మీ నరసయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పర్‌బస్తీలో అన్నదానం

గోల్కొండ: అన్నదానానికి మించిన పుణ్యకార్యం మరేది లేదని బీజేపీ సీనియర్ దేవర శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గుడిమల్కాపూర్ ఉప్పర్‌బస్తీలో కార్వాన్ సాగర సంఘం ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో సాగర సంఘం ప్రతినిధులు రక్షిత్ సాగర్, కట్ల అశోక్, అశోక్ సాగర్, వినోద్‌సాగర్, వెంకటేష్ సాగర్ తదితరులున్నారు.



సమాజ సేవతోనే ఎంతో తృప్తి



కార్పొరేటర్ శంకర్‌యాదవ్‌ను అభినందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్

అబిడ్స్: సమాజ సేవతోనే మనిషికి ఎంతో తృప్తి ఉంటుందని బేగంబజార్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్ పేర్కొన్నారు. సామాజిక కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుంటానన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా సేవ చేయడమే తన ఉద్దేశమన్నారు. నిరంతరం సమాజ సేవ చేస్తూ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్ శంకర్‌యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

'స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేయడం సరికాదు'

గన్‌ఫౌండ్రీ: స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేయడాన్ని రాణి రుద్రమ్మ దేవి సేవా సమితి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేయడం సరికాదన్నారు. ఈ విషయంపై పునారాలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ అరుణ, డాక్టర్ సంధ్య, అనంతలక్ష్మి, నాగలక్ష్మి, విజయరాణి, శ్రీపాదరాధ పాల్గొన్నారు.

వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయండి



అబిడ్స్: మెట్రో వాటర్‌బోర్డులో నూతనంగా ప్రవేశపెట్టిన ఏఎంఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ యునైటెడ్ కాంట్రాక్టర్స్ ఫోరం మీడియా ఇన్‌చార్జ్, సెక్రటరీ పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏఎంఎస్ (యానివల్ మెయింటెన్స్ ఆఫ్ సెక్షన్) విధానంతో వందలాది మంది కాంట్రాక్టర్లు రోడ్డు పాలవుతున్నారన్నారు. శుక్రవారం వాటర్‌బోర్డు ఎండీ దాన కిశోర్‌కు పోల్కం శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా వాటర్‌బోర్డులో ఉన్న విధానాలను రద్దు చేసి ఏఎంఎస్ విధానం అమలు చేయడంతో చిన్నాచితక కాంట్రాక్టర్లు అప్పులపాలై రోడ్డుపాలవుతున్నారన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ తమ కాంట్రాక్టర్ల దుర్భర పరిస్థితిని అర్థం చేసుకుని పాత విధానం అమలు అయ్యే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు.

'పండగలు మత సామరస్యాన్ని పెంపొందిస్తున్నాయి'



షీర్‌కుర్మాను పంపిణీ చేస్తున్న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ శ్రీనివాసరావు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్రంలో పండగలు మత సామరస్యానికి పెంపొందిస్తున్నాయన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ డాక్టర్ గడాల శ్రీనివాసరావు అన్నారు. టీఎన్జీఓస్ డీఎంహెచ్ఎస్ అధ్యక్షుడు మామిడి ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం డీహెచ్ కార్యాలయం వద్ద ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు షీర్‌కుర్మాను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖలో అన్ని కులమతాలకు చెందిన ఉద్యోగులు పనిచేస్తున్నారని, కులమత బేధాలు లేకుండా అన్ని పండగలను మత సామరస్యంతో జరుపుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి హరి, అసోసియేట్ ప్రెసిడెంట్ దేవిదాస్, నగర ఉపాధ్యక్షులు చక్రధర్, లీగల్ సెల్ కార్యదర్శి సల్లాఉద్దీన్, కోశాధికారి క్రాంతికుమార్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, రావూఫ్, నిజాం, రఫీ, భరణి, రాధా, అజ్మీరా పాల్గొన్నారు.

కిడ్నాప్ అయిన చిన్నారి ఆచూకీ లభ్యం



పోలీసుల అదుపులో నిందితులు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఓ యాచకురాలి వద్ద నుంచి రెండు నెలల పసిపాపను ఎత్తుకెళ్లిన ఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఆ పసిపాపను గుర్తించి కిడ్నాప్ చేసిన వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలోని మాల్ ప్రాంతానికి చెందిన స్వాతి ఉస్మానియా ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో

నిందితుల రిమాండ్

యాచిస్తూ జీవనం సాగిస్తోంది. ఆమెకు రెండు నెలల పసిపాప ఉంది. ఈ క్రమంలో మరో మహిళ ఆమెతో సన్నిహితంగా ఉంటూ ఉండేది. గురువారం రాత్రి స్వాతి పాపతో కలిసి ఫుట్‌పాత్‌పై పడుకుంది. ఆమె నిద్రించిన సమయంలో ఆ మహిళ మరో యువకుడితో కలిసి పాపను తీసుకొని అక్కడి నుంచి పారిపోయారు. నిద్రలేచిన స్వాతి పాప కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో సీసీ ఫుటేజిని పరిశీలించిన పోలీసులు అఫ్జల్‌గంజ్ బస్ స్టేషన్‌లో వారు డ్రైవరుతో మాట్లాడినట్లు గుర్తించి ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఉప్పుగూడ రైల్వే పోలీసులు పాపను గుర్తించి సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొని పాపను స్వాధీనం చేసుకున్నారు. కిడ్నాప్‌కు పాల్పడ్డ వారు మహారాష్ట్రకు చెందిన జ్యోతి, జార్ఖండ్‌కు చెందిన వికాస్‌లుగా గుర్తించారు.

యువకుడి హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్

జియాగూడ: బైకు కోసం తలెత్తిన గొడవలో ఓ యువకుడి హత్యకు కారకులైన ఆరుగురు నిందితులను కుల్సుంపురా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు శుక్రవారం సౌత్ వెస్ట్ డీసీపీ కిరణ్ వివరాలను వెల్లడించారు. ఈనెల 24న ఆసిఫ్‌నగర్‌కు చెందిన సోహెల్(16) విద్యార్థి, గిరికపల్లికి చెందిన దీపక్‌కుమార్ (21) స్విగ్గీ డెలివరి బాయ్. వీరి స్నేహితులు అయిన అరుణ్, ఫైజాన్ వద్ద నుంచి జియాగూడ సంజయ్‌నగర్‌కు చెందిన యోగేష్(20) జీహెచ్ఎంసీ లేబర్. ఇతను గత నెలలో అరుణ్, ఫైజాన్ నుంచి రూ.20 వేలకు బైక్ మాట్లాడుకుని రూ.5 వేలు మాత్రమే చెల్లించి బైకు తెచ్చుకున్నాడు. మిగతా డబ్బులు ఇవ్వకపోవడంతో కొన్ని రోజుల క్రితం సోహెల్ వద్ద నుంచి ఫైజాన్, అరుణ్ ఇతర స్నేహితులతో కలిసి యోగేష్ ఇంటి వద్ద నుంచి బైక్‌ను తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం దీపక్‌కుమార్, సోహెల్ పెట్రోల్ తెచ్చుకోవడానికి 100 ఫీట్ల జాతీయ రహదారిలో గల పెట్రోల్ పంప్ వద్దకు వెళ్లారు. అది కాస్తా మూసి ఉండడంతో తిరిగి వస్తుండగా యోగేష్, అత్తాపూర్‌కు చెందిన శంకర్, వెంకటేష్‌నగర్‌కు చెందిన శరత్ కుమార్, దుర్గానగర్‌కు చెందిన వరుణ్‌రావు, పురానాపూల్‌కు చెందిన ఆకాష్, జియాగూడ నలంద స్కూల్ ప్రాంతానికి చెందిన మహేష్, పురానాపూల్‌కు చెందిన రాజస్వామి సోహెల్, దీపక్‌ను పట్టుకుని ఫైజాన్ అడ్రస్ తెలపాల్సింగా నిలదీశారు. బైక్‌పై కూర్చోబెట్టుకుని తాడ్బన్, బహదూర్‌పురా, జియాగూడ కమేళా, గ్రేవియార్డ్ ప్రాంతాల్లో తిప్పుతూ పలుమార్లు దాడి చేశారు. రాత్రికి జియాగూడ డబుల్‌బెడ్‌రూమ్ కె.బ్లాక్ 5వ అంతస్థు టెర్రస్‌పైకి తీసుకువెళ్లి బీర్ సీసాతో తల పగలగొట్టారు. అపస్మారక స్థితికి చేరుకున్న సోహెల్, దీపక్ కుమార్‌ను పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా సోహెల్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు నిందితులను శుక్రవారం జియాగూడ పటేల్ హోటల్ ప్రాంతంలో పట్టుకుని విచారించి అదుపులోకి తీసుకున్నారు.

నిందితులది నేర చరిత్రే..

జియాగూడ సంజయ్‌నగర్ ఎంసీహెచ్ కాలనీకి చెందిన యోగేష్‌పై కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు, షాహినాయత్‌గంజ్‌లో ఒక్క కేసు నమోదు అయి ఉంది. అలాగే వరుణ్‌రావుపై రౌడీషీటర్ నమోదై ఉంది. రాజాస్వామిపై కూడా రౌడీషీటర్‌గా నమోదై ఉందని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ ఏసీపీ ఆర్.సతీష్‌కుమార్, కుల్సుంపురా డీఐ శైలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.